

సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఉపాధ్యాయురాలు శ్వేత

భూములిచ్చేందుకు స్వచ్ఛందంగా

ముందుకు రావాలి

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

దుద్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భాగంగా ఇంకెవరైనా రైతులు మిగిలిపోయి ఉంటే స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ముందుకు రావాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. శుక్రవారం దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులపై విచారణ చేపట్టారు. ఆయన దరఖాస్తులను సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలెపల్లి, హకీంపేట్, లగచర్ల, రోటిబండ, పులిచర్ల కుంట తండాల పరిధిలో ఇంకా ఎవరైనా రైతులు భూములు ఇవ్వని పక్షంలో వారి పరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేస్తామని తెలిపారు. దీని వల్ల చాలా తక్కువ పరిహారం అందుతుందన్నారు. రెవెన్యూ సదస్సులో గ్రామంలో 37 దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ కిషన్ నాయక్ తెలిపారు. ఇప్పటికే 24 భూ సమస్యలు పరిష్కారం కాగా మిగతా 13 సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో లగచర్లలో జరిగిన సంఘటనల నేపథ్యంలో పరిసర గ్రామాల శివారులో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం హకీంపేట్‌కు మంజూరైన ఇందిరా క్రాంతి మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, ఆర్ఐ నవీన్‌కుమార్, నాయకులు యుగంధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రామాంజనేయులు, బసప్ప, వెంకట్‌రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ ఐటీఐలో ఖాళీ సీట్ల భర్తీ

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఐటీఐలో కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సులతో పాటు పాత కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేస్తున్నామని ప్రిన్సిపాల్ హనుమాన్ నాయక్ తెలిపారు. కొత్తగా మహిళల కోసం ఫ్రూట్స్ అండ్ వెజిటెబుల్ ప్రాసెసింగ్‌లో 40 సీట్లు, స్వీయింగ్ టెక్నాలజీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకొని శిక్షణ పొందవచ్చని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 14 ఏళ్ల పైబడిన వారందరూ ఈ కోర్సులకు అర్హులేనని తెలిపారు. అదే విధంగా ఐటీఐలోని పాత కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను 30వ తేదీ లోపు భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఐటీఐను సంప్రదించి పూర్తి వివరాలు సేకరించాలని కోరారు.



అర లీటరుతోనే సరి..

అర లీటర్ నానో యూరియా బాటిల్ బస్తా యూరియాతో సమానమని అధికారులు చెబుతున్నారు. అవసరానికి మించి ఎరువుల వాడడం వల్ల పెట్టుబడి పెరగడంతో పాటు ఇతర అనర్థాలు జరుగుతున్నాయి. ఏటా వరి, పత్తి, ఇతర ముఖ్యమైన పంటలకు ఎకరాకు రెండు నుంచి రెండున్నర బస్తాల యూరియా వాడాల్సి ఉండగా.. మూడు నుంచి నాలుగు బస్తాలు వినియోగిస్తున్నారు. దీంతో సమతుల్యత లోపించి భూసారం దెబ్బతింటోంది. ఈ కారణంగా పంటలకు తెగుళ్లు పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం వ్యవసాయ రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ పెట్టుబడులను తగ్గించి రైతులకు ప్రయోజనం కలిగించేందుకు గుళికల రూపంలో ఉండే యూరియా, డీఏపీకి బదులు ద్రవరూపంలో ఉండే నానో యూరియా, నానో డీఏపీని అందుబాటులోకి తీసుకువచ్చింది.

నానో.. లాభాలెన్నో!

ద్రవరూప యూరియాతో అధిక దిగుబడి

కొన్నిరోజులుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రైతులను యూరియా కొరత వేధిస్తోంది. వేకువ జాము నుంచే పీఏసీఎస్‌ల వద్ద క్యూ కడుతున్నారు. గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటి సమయంలో నానో యూరియా వాడితే మేలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అర లీటర్ నానో యూరియా బాటిల్.. బస్తా యూరియాతో సమానమని అవగాహన కల్పిస్తున్నా రైతులు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. తక్కువ ఖర్చుకే ద్రవ రూపంలో నానో యూరియా, డీఏపీలను ప్రభుత్వం అందిస్తున్నా వాటి వాడకానికి ముందుకు రావడం లేదు. నానో యూరియాపై సరైన అవగాహన కల్పిస్తే యూరియా కష్టాలు తీరే అవకాశం ఉంది.

యూరియా, డీఏపీ కొరతకు ప్రత్యామ్నాయం

అవగాహన లేమితో ఆసక్తి చూపని రైతులు

తక్కువ వ్యయంతో ఎక్కువ ఫలితాలు

ఎనిమిది శాతం అధిక దిగుబడి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఎరువుల వాడకం విషయంలో రైతులు సాంప్రదాయ విధానాలనే ఇంకా పాటిస్తున్నారు. రైతులు పోటీ పడి అవసరాలకు మించి పంటలకు ఎరువులను వాడుతున్నారు. ఏటా ఎరువుల వినియోగం పెరిగి అనర్థాలు పెరుగుతున్నా వీటిని తగ్గించే ప్రయత్నాలు జరగడం లేదు. సాంకేతికత మేళవించి తయారు చేసిన ఎరువుల వాడకంలో ఇంకా వెనుకంజలోనే ఉన్నారు. గత కొంతకాలంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్న విషయం తెలిసిందే. యూరియాకు ప్రత్యామ్నాయంగా

యూరియా వినియోగం (ఎకరాకు కేజీల్లో..)

పంట	అవసరం	వినియోగం
వరి	90	180
పత్తి	90	180
మొక్కజొన్న	135	225
కంది	25	35
కూరగాయలు	30	45

మిగతా 7వ పేజీలో...

సత్తాచాటిన

కొత్లాపూర్ పాఠశాల

టీఎల్ఎం మేళాలో రెండో బహుమతి

తాండూరు రూరల్, సెప్టెంబరు 19, (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాలో మండలంలోని కొత్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల సత్తా చాటింది. ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు శ్వేత ప్రదర్శించిన టీఎల్ఎం(టీచర్ లర్నింగ్ మెటీరియల్)కుగాను జిల్లా స్థాయి రెండో బహుమతిని అందుకున్నారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వినోద్‌కుమార్‌తోపాటు గ్రామానికి చెందిన అమ్మ ఆదరణ కమిటీ అధ్యక్షులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయురాలిని అభినందించారు. అలాగే మండలంలోని గౌతాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు రమాదేవి నుంచి గణితంలో డీఈవో నుంచి రెండో బహుమతి అందుకున్నారు. వీరిని పీఆర్‌టీయూ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, కార్యదర్శి వినోద్‌కుమార్ అభినందించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్

పోటీలకు ఉషారాణి



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్నేహలత

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల(మహేంద్ర హిల్స్) అథ్లెటిక్స్ అకాడమీ క్రీడాకారిణి ఉషారాణి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. ఏపీ, గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో 23వ తేదీ నుంచి 25 వరకు 35వ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్నేహలత, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు రామలక్ష్మణ్, శేషుకుమారి, కోచ్ భిక్షపతి యాదవ్ ఉషారాణిని అభినందించారు.

నేడు వికారాబాద్‌కు రాష్ట్ర

సమాచార కమిషన్ బృందం

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్ల పర్యటన ఖరారైంది. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, దేశాల భూపాల్, బోరెడ్డి మొహిసినా పర్వీన్, అయోధ్యరెడ్డి, మెర్ల వైష్ణవి శనివారం జిల్లా కేంద్రానికి రానున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారి పర్యటన కొనసాగనుంది. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల్లో సమాచార హక్కు చట్టం అమలు తీరు ఏ విధంగా ఉందనేది వారు పరిశీలించనున్నారు. అలాగే సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వివిధ కార్యాలయాల ప్రజా సమాచార అధికారులతో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా కేస్ స్టడీస్‌తో పాటు విచారణలు కూడా చేపట్టనున్నారు. ఆర్టీఐ చట్టం కింద చేసిన అప్పీళ్లు, ఫిర్యాదులపై పీఐవోలతో సమీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది.

వినియోగంలోకి పరిషత్ భవనాలు



త్వరలోనే రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపు

పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ

తీరనున్న జిల్లా ప్రజల కష్టాలు

మేడ్చల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పూర్తిగా పట్టణ ప్రాంతంగా మారింది. గతంలో 61 గ్రామాలు, 9 మున్సిపాల్టీలు, 3 కార్పొరేషన్‌లు ఉండగా, ఇటీవల 61 గ్రామాలు కూడా మున్సిపాల్టీలుగా మారిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ భవనాలు నిరుపయోగంగా మారాయి. దీంతో వాటిని ఇతర కార్యాలయాల కోసం ఉపయోగించుకునేలా అనుమతి ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాగా, పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్ భవనాలను తాత్కాలికంగా అద్దె భవనాల్లో కొనసాగుతన్న ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం వినియోగించుకునే విధంగా పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

తీరనున్న ప్రజల కష్టాలు

మేడ్చల్ జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాలను జిల్లా రిజిస్ట్రార్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కేటాయించారు. ప్రస్తుతం ఈ కార్యాలయాలు మేడ్చల్ జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రైవేటు కార్యాలయంలో కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాలు భవనం మొదటి అంతస్తులో ఉండటంతో పాటు మెట్లు సరిగా లేకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా కార్యాలయాలకు వస్తున్న ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు కూడా ఫిర్యాదు

మిగతా 8వ పేజీలో...

పోటెత్తిన వరద.. కూలిన ప్రహరీ

కీసర రూరల్/శామీర్‌పేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో నాగారం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గురువారం రాత్రి ఎగువ ప్రాంతాలైన కుషాయిగూడ, దమ్మాయిగూడ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో నాగారంలోని అన్నరాయని చెరువు నుంచి భారీ వరద పోటెత్తింది. దీంతో నాగారం మున్సిపాలిటీ విజయపురి కాలనీలో నాలకు ఆనుకుని నిర్మించిన ఓ ఇంటి ప్రహరీ కొట్టుకుపోయింది. దీంతో ఆ ఇంట్లో వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. అదే విధంగా దమ్మాయిగూడ నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదతో కుమ్మరి కుంట ఉప్పొంగిందింది. రాంపల్లి చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై భారీగా వరద ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలైన బీఎంఆర్ ఎన్‌క్లేవ్, సాయిసంజీవ్ నగర్ కాలనీ, అరవింద్ నగర్ కాలనీలు జలమయం అయ్యాయి. రాంపల్లి నుంచి చెర్లపల్లి వెళ్లే రోడ్డులోని బొంత వాగు వద్ద వరద ఉధృతి కొనసాగింది. రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలను నిలిపి వేశారు. కాగా, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం మున్సిపాలిటీలోని ముంపు ప్రాంతాలను సందర్శించారు.

నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు



విజయపురి కాలనీలో కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న కమిషనర్ భాస్కర్‌రెడ్డి

దేవరయాంజాల్-కొంపల్లి రోడ్డు మూసివేత

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ - కొంపల్లి రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచాయి. దీంతో శుక్రవారం మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తాత్కాలికంగా ఆ రోడ్డును మూసివేశారు. ఆ రోడ్డు మూసివేతను వాహనదారులు గమనించి సహకరించాలని పోలీసులు కోరారు.

21న కబడ్డీ పోటీలు

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తిరుమల్, అనిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం(21వ తేదీ) ఉదయం 10 గంటలకు బాలబాలికలకు అందరూ హాజరు కావాలని సూచించారు. హాజరయ్యేవారు ఆధార్ కార్డు, బోనోఫైడ్, బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ మెమో వెంట తీసుకు రావాలన్నారు. ఎంపికైన వారు 25వ తేదీ నుంచి 28 వరకు నిజామాబాద్‌లో జరగనున్న సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరలకు 9701225929, 7032799544 నంబర్లను సంప్రదించాలన్నారు.



అధ్వానంగా రోడ్లు

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

నిలిచిన మరమ్మతు పనులు

ఇబ్బందుల్లో బషీరాబాద్ మండల ప్రజలు

8

తల్లిని చంపిన తనయుడు

మద్యం మత్తులో పింఛన్ డబ్బుల కోసం ఘాతుకం

వికారాబాద్ జిల్లా పరిగి మండలంలో ఘటన



మల్లమ్మ(ఫైల్)

పరిగి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నవ మాసాలు మోసి కని, పెంచిన తల్లిని మద్యం మత్తులో అమానుషంగా హత్య చేశాడు ఓ కసాయి కొడుకు. ఈ హృదయ విదారక ఘటన పరిగి మండలం గడిసింగాపూర్‌లో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన మిట్టకోడూరు మల్లమ్మ(65) భర్త గతంలోనే చనిపోయాడు. ఆమెకి ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు మహిపాల్ హైదరాబాద్‌లో ఉంటుండగా, పెద్ద కొడుకు అంజిలయ్యతో కలిసి గడిసింగాపూర్‌లోనే మల్లమ్మ నివసిస్తుంది. అంజిలయ్య మద్యానికి బానిసై కొంతకాలం నుంచి జులాయిగా తిరుగుతున్నాడు. అయితే డబ్బుల కోసం తల్లిని వేధింపులకు గురి చేయడం ప్రారంభించాడు. డబ్బులు కావాలని అనేకసార్లు గొడవపడ్డాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో అంజిలయ్య తల్లితో గొడవ పడ్డాడు. ఆమెకు వచ్చే పింఛన్ డబ్బులు ఎక్కడున్నాయని, వాటిని తనకు ఇవ్వాలని గొడవపడ్డాడు. తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో కోపోద్రిక్తుడై పక్కన ఉన్న కట్టెతో తలపై కొట్టడంతో రక్తగాయాలతో కింద పడిపోయింది. గొడవ గురించి తెలుసుకున్న స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే రక్తపు మడుగులో పడి మృతి చెందింది. తల్లి మృతిపై చిన్న కొడుకు మహిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పరిగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మల్లమ్మ మృతదేహానికి పరిగి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అంజిలయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

196 కిలోల కల్తీ అల్లం పట్టివేత

తాండూరులో టాస్క్‌ఫోర్స్ దాడులు

తాండూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో 196కిలోల కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దీంతోపాటు మరో 60 కిలోల పాడైన అల్లం ముడి సరుకును స్వాధీనం చేసుకొని తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యాపారులను అదుపులోకి తీసుకున్నారు. తాండూరు పట్టణంలో శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, సిబ్బంది పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. పట్టణంలోని మణికంఠ కిరాణ షాపు యజమాని పి.వీరన్న దుకాణంలో మొదట టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా 30 కేజీల కల్తీ అల్లంవెల్లుల్లి దొరికింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. కాగా, అతను హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ సలీం దగ్గర దీన్ని తీసుకున్నట్లు చెప్పడంతో ఇమ్రాన్ సలీంను కూడా అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 166కిలోల కల్తీ అల్లం పేస్టును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను స్వాధీనం చేసుకున్న సరుకును విచారణ నిమిత్తం తాండూరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ నకిలీ సరుకు ఎక్కడ తయారవుతుందో దీని వెనుక ఇంకా ఎవరైన ఉన్నారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ ఉత్పత్తులు నివారించడానికి భవిష్యత్తులో కూడా దాడులు కొనసాగుతాయని ఎస్పీ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



స్వాధీనం చేసుకున్న కల్తీ అల్లంతో పోలీసులు

తక్షణమే రుణమాఫీ చేయాలి

భిక్షాటన చేసి వినూత్న నిరసన

ఘట్‌కేసర్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులకు తక్షణమే పంట రుణమాఫీని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భిక్షాటన చేసిన నిరసన వ్యక్తం చేశారు. రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో గత 10 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం రుణమాఫీ చేసి ఘట్‌కేసర్ రైతులకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఘట్‌కేసర్ మండల రైతులకు వెంటనే పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రుణమాఫీ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న రుణమాఫీ సాధన సమితి సభ్యులు



ఉబికివస్తున్న గంగమ్మ

పెద్దేముల్, సెప్టెంబరు 19(ఆంధ్ర జ్యోతి): ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో గంగపైపైకి ఉబికివస్తోంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి శివారులోని పోచారం మల్లప్ప వ్యవసాయ పొలంలోని బోరులో కొద్ది రోజులుగా నీరు ఉవ్వెత్తున ఉబికివస్తోంది. మోటారు ఆన్ చేయకుండానే నీరొస్తుడంతో ఆ రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గతంలో ఒకసారి ఇలాగే నీరు ఉబికి నీరొచ్చిందని, భారీ వర్షాలు కురిస్తే బోరులోంచి నీరు ఉప్పొంగి వస్తుందని రైతు వివరించారు.


తట్టేపల్లిలో బోరులోంచి ఉబికి వస్తున్న నీరు

అంచనాలు సిద్ధం చేయాలి

● 'గొలుసు కట్టు..ఆయువు పట్టు'కథనంపై ఎమ్మెల్యే స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): కాకతీయ కాలంలో రైతులకు జీవనాధారమైన గొలుసుకట్టు చెరువుల నీటి మళ్లింపుకు సర్వే చేయించి అంచనాలతో పూర్తి రిపోర్టును తయారు చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న ప్రచురితమైన గొలుసుకట్టు.. ఆయువు పట్టు కథనానికి ఆయన స్పందించారు. దీంతో అదనంగా 15 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని అంచనా ఉన్నప్పుడు కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద ఉన్న నీటిని చెరువులకు మళ్లించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతోపాటు శాసనసభ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు

పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ

పరిగి,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ డీఎం సుఖేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆరుమాసాల క్రితమే వచ్చిన ఆయన హైదరాబాద్ డిపోకు బదిలీ అయ్యారు. హైదరాబాద్-2 డిపోలో పని చేస్తున్న కృష్ణమూర్తి పరిగికి పోస్టింగ్ ఇచ్చారు. రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం సిగ్గుచేటు

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య



వికారాబాద్‌లో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు, విద్యార్థులు

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన సంవత్సరంలోపే రీయింబర్స్‌మెంట్ నిధులన్నీ చెల్లిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు రోడ్డెక్కినా స్పందించక పోవడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య ఆరోపించారు. శుక్రవారం వికారాబాద్‌జిల్లా కేంద్రంలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. పోలీసులు ధర్నా చేస్తున్న వారిలో నలుగురుపై కేసు నమోదు చేసి స్టేషన్‌బెయిల్ అందించారు. జుబేర్, అజయ్ సర్ఫరాజ్, పర్వేజ్, సురేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

24 లోపు నివేదిక అందజేస్తాం

వికారాబాద్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కేటగిరీల వారీగా ఓటర్ల నివేదికను ఈనెల 24లోపుసమర్పిస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శుక్రవారం ఓటరు జాబితా విధి విధానాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగాఅదనపు కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా పూర్తి సమాచారాన్ని ఎస్ఐఆర్‌కు సమర్పిస్తామని తెలిపారు.















నానో.. లాభాలెన్నో!

(ఐదో పేజీ తరువాయి)

తక్కువ ఖర్చుకే ద్రవరూపంలో నానో యూరియా, డీఏపీలను ప్రభుత్వం అందిస్తున్నా రైతులు మాత్రం దీనిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వీటిపై రైతులకు సరైన అవగాహన కూడా కల్పించకపోవడంతో రైతులు ఇంకా పాత పద్ధతులనే ఎంచుకుంటున్నారు. వాస్తవానికి 2022 నుంచి ఉమ్మడి జిల్లాలో నానో యూరియా వాడకాన్ని అమల్లోకి తెచ్చారు. అయితే రైతులకు తగిన విధంగా దీనిపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు గుళికల రూపంలో ఉన్న యూరియా వాడకానికే మొగ్గు చూపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు సమావేశాలు పెట్టి నానో యూరియా వాడాలని సూచిస్తున్న రైతులు ససేమిరా అంటున్నారు. అవగాహన లేకపోవడంతోనే రైతులు నానో యూరియాపై ఆసక్తి చూపడం లేదు. గుళికల రూపంలో ఉండే యూరియా మార్కెట్‌లో దొరకకున్నా వాటికోసం గంటల తరబడి క్యూలో పడిగాపులు పడుతున్నారు. కానీ అందుబాటులో ఉన్న ద్రవరూపంలోని నానో వైపు ఆసక్తి చూపడం లేదు. పైగా నానో వాడకం పెంచాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ఇలా యూరియా కొరత సృష్టిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

తగ్గనున్న వ్యయం

సాంకేతికంగా అభివృద్ధి చేసిన 'నానో' ఎరువులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇవి నానో టెక్నాలజీతో అభివృద్ధి చేసిన నూతన ద్రవ పదార్థాలు పర్యావరణానికి అనుకూలమైన ఈ నానో యూరియా, నానో డీఏపీకి తక్కువ పరిమాణం ఉండడంతో ఎలాంటి రవాణా ఖర్చులు ఉండవు. దీంతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. బస్తా యూరియాలోని పోషకాలన్నీ ఒక చిన్న సీసా (అరలీటరు)లోనే ఇమిడి ఉంటాయి. వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు 94 రకాల పంటలకు దీన్ని పిచికారీ చేసుకోవచ్చు. నానో యూరియాను లీటరు నీటికి 4మి.మీ చొప్పున కలిపి వాడుకోవాలి. అరలీటరు సీసాను చేతిలో పట్టుకుని రైతు వెళ్లవచ్చు. రవాణా ఖర్చు కూడా ఉండదు. సీసాను నిల్వ చేయడం కూడా సులువే. గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన అవసరం లేదు. నానో యూరియాను కొన్ని పురుగు మందులతో కలిపి పిచికారీ చేయడానికి వీలు లేదు. దీన్ని గమనించి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. గుళికల రూపంలోని ఎరువును 30శాతమే పంట గ్రహిస్తుంది. అదే నానో రూపంలో అయితే 80శాతం గ్రహిస్తుంది. అలాగే వాయు, నీటి కాలుష్యం తగ్గుతుంది. ప్రస్తుతం 45కిలోల యూరియా బస్తాలో ధర రూ.266 కాగా, నానో అర లీటరు సీసా ఖరీదు రూ.240. ఇది యూరియా బస్తాతో సమానం. దీని వాడకం వల్ల 8శాతం ఎక్కువ దిగుబడి వస్తున్నట్లు పరిశోధనల్లో తేలిందని వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంటలు చురుకైన దశలో ఉన్నప్పుడు ఆకులపై పిచికారీ చేస్తే సరిపోతుంది. మొదటి స్ప్రే చేసిన 20 నుంచి 25 రోజుల తరువాత రెండోసారి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. అలాగే డీఏపీ ప్రస్తుత ధర రూ.1350 కాగా నానో డీఏపీ రూ.600కు లభ్యమవుతుంది.



మాట్లాడుతున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

కడ్తాల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి కూలీలు, సిబ్బంది న్యాయమైన సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట కడ్తాల్, ఆమనగల్లు, మైసిగండి ఆశ్రమ పాఠశాలల డైలీ వర్కర్స్, సిబ్బంది చేపట్టిన సమ్మె శిబిరాన్ని 8వ రోజు శుక్రవారం లక్ష్మీనర్సింహారెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, బీసీ సంఘం మండలాధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్, నాయకులు లాయక్‌అలీ, నర్సింహ, రాములు, దాసు, పాండు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



యాచారంలో మొక్క నాటుతున్న జెడ్పీసీఈవో కృష్ణారెడ్డి

యాచారం. సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యాచారం ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి విద్యార్థి రెండు మొక్కలు నాటి వాటిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న గదుల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం స్వచ్ఛతపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

మారుతున్న అభ్యసనల ప్రకారం బోధన ఉండాలి

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు మారుతున్న అభ్యసన ప్రక్రియలకు అనుగుణంగా బోధన అందించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్ మండల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం వికారాబాద్ మండల శాఖ అధ్యక్షుడు రాఘవేందర్ గుప్తా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నిరంతరం తపిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జాక వెంకటేశం, సంతోష్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజ్, ప్రసాద్‌కుమార్, కృష్ణారెడ్డి, మల్లేశం స్వామి, నర్సిములు, సురేందర్ రెడ్డి, సంగమేశ్వర్ ఉన్నారు.

8వ వేతన కమిషన్‌ను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న రైల్వే కార్మికులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వెంటనే 8వ వేతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఘట్‌కేసర్ బ్రాంచి కార్యదర్శి బొల్లేపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జాతీయ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం ఘట్‌కేసర్‌లో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కమిషన్ విధి విధానాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, అన్వేష్, రవి, జక్కిబాబు, శ్రీనివాస్, జ్ఞానేశ్వరీ, అనసూయ ఉన్నారు.

షాద్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో శుక్రవారం రాత్రి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, రూరల్ సీఐ నర్సయ్య, డీఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మూడు ఎక్సైజ్ కేసులు, మూడు గుట్కా కేసులు, 13 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, నాలుగు ఆరుబయట మద్యం సేవించే కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.


సీఎంఆర్‌ఎఫ్ పేదలకు భరోసా

కొందుర్గు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ పేదలకు భరోసాగా నిలుస్తుందని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం కొందుర్గు మండల కేంద్రం శివారులోని హాజరత్ శాలి హలి బాబా దర్గాలో ఎమ్మెల్సీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట రాజేష్ పటేల్, శ్రీధర్ రెడ్డి, టేకులపల్లి చెన్నారెడ్డి, రవీందర్ రెడ్డి, రామకృష్ణ, బాబూరావు, సందీప్, గొల్ల వేణు, రవీందర్ గౌడ్, హనుమంతు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

యాచారం బడికి ప్రహరీ నిర్మించండి

యాచారం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులతో కలిసి రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డికి వినతిపత్రం అందించారు. విద్యార్థులు తరచూ రోడ్డుపైకి వెళ్తున్నారని చెప్పారు. వినతిపత్రాన్ని కోదండరెడ్డి వాట్సాప్‌లో రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి పంపించి ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. నీటి వసతి కల్పించడానికి పాఠశాలలో ఒక బోరు వేయించాలని కోదండరెడ్డి కోరడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

వైద్యశిబిరం విజయవంతం



యాచారం: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు/యాచారం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మైమునా బేగం, మంజులాదేవిలు శిబిరాన్ని ప్రారంభించారు. మధుమేహ, క్యాన్సర్, టీబీ, దంత, కంటి, రక్తహీనత, మాతా శిశు సంరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. 241 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే యాచారం ప్రభుత్వాసుపత్రిలో చిన్నపిల్లలను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మహిళలు, గర్భిణీలకు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. అక్టోబరు 3వరకు గైనాకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు సేవలందిస్తారని ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ ప్రియాంక తెలిపారు. శిబిరాన్ని డీడీఎంహెచ్‌వో సుధామాధవి సందర్శించి సూచనలు చేశారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/కొత్తూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా నిలిపివేసిన పనులను హెచ్‌ఎండీఏ ద్వారా రూ.10 కోట్లు సమకూర్చి పనులను పూర్తి చేస్తున్నామన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేసిందన్నారు. హెచ్‌ఎండీఏ ద్వారా మంజూరైన రూ.10 కోట్లతో నందిగామ మండలం శ్రీనివాసులుగూడలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామంలో తొమ్మిది సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.90లక్షలు, ఇన్ముల్‌నర్వ నుంచి జేపీ దర్గా రోడ్ల నిర్మాణానికి రూ.కోటి, జేపీ దర్గాలో కార్యాలయం, మల్టీపర్పస్ బిల్డింగ్, గదుల నిర్మాణానికి రూ.1.50 కోట్లు, జేపీ దర్గా, ఇన్ముల్‌నర్వ మధ్య రూ.40లక్షలతో సీసీ రోడ్డు, చౌదరిగూడ మండలం గుర్రంపల్లి - రావిర్యాల బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.3.50 కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. మహిళలు ఉపాధి పనులు నేర్చుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి తన నెల జీతం రూ.2లక్షలను విరాళంగా సయ్యద్ సుల్తానా ఎడ్యుకేషనల్ సొసైటీకి అందజేశారు. ఈ సొసైటీ ద్వారా మహిళలకు శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా ఎదిగేలా సొసైటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, పార్టీ సీనియర్ నేత రఘునాయక్, కృష్ణారెడ్డి, బాలరాజుగౌడ్, ఎండీ ఇబ్రహీం, అగ్గనూరు బస్వం, పురుషోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలి

విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూర్ మండల పరిధిలోని పెంజర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, ప్రధానోపాధ్యాయులు రఘుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రోబోటిక్ మేళా

500 మంది విద్యార్థులు.. 100కు పైగా ప్రదర్శనలు



విద్యార్థులు రూపొందించిన రాకెట్ నమూనాను పరిశీలిస్తున్న నిర్వాహకులు

కడ్తాల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ ఫార్చ్యూన్ బటర్ ఫై పాఠశాలలో శుక్రవారం స్వచలిత్ ప్రజ్ఞ కల్ప(రోబోటిక్ రెవల్యూషన్) మేళా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకుడు శేషగిరి రావు జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించారు. ఇందులో 500ల మంది విద్యార్థులు 100కు పైగా నమూనాలను ప్రదర్శించారు. ఇస్రో రాకెట్స్, బ్రహ్మోస్ క్షిపణి నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పర్యాటకులపై పహల్గామ్‌లో దాడి, ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. నిత్యజీవితంలో గణితం, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధి, సామాజిక సంక్షేమం, సుస్థిర అభివృద్ధి, భవిష్యత్‌లో రోబోటిక్, ఏఐ వినియోగం గురించి వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఋతులు, అధిక దిగుబడుల సాధన, బహుళార్థక ప్రాజెక్టులపై విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సహ వ్యవస్థాపకుడు రమేశ్, ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, కోఆర్డినేటర్ శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అశోక్‌రెడ్డి, క్రాంతికుమార్, రజాక్, నవీన్

ఎస్టీయూ నూతన కార్యవర్గాలు

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాల నూతన కార్యవర్గాలను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమనగల్లు పట్టణంలో ఎస్టీయూ నాయకులు సమావేశమై సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ఆమనగల్లు మండల శాఖ అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పున్న సత్యవాణి, ప్రధాన కార్యదర్శిగా శ్రీలత, సహ కార్యదర్శిగా వనిత, ఆర్థిక కార్యదర్శిగా సుజాత, క్రీడా కార్యదర్శిగా అపరంజిత, సభ్యులుగా మాధవీలత, జిల్లా కౌన్సిలర్‌గా భార్గవి ఎన్నికయ్యారు. తలకొండపల్లి మండల అధ్యక్షుడిగా క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా ఎండీ రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా జె.హతిరామ్, సహ కార్యదర్శిగా డి.లత, ఆర్థిక కార్యదర్శిగా శోభారాణి, జిల్లా కౌన్సిలర్‌గా బాల్‌నర్సింహులు ఎన్నికయ్యారు. కడ్తాల మండల అధ్యక్షుడిగా అబ్దుల్ రజాక్, ఉపాధ్యక్షులుగా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గోవర్దన్, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా వీహెచ్ పెవిసీస్‌లు ఎన్నికయ్యారు. మాడ్గుల మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా నవీన్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, కళావతి, ప్రధాన కార్యదర్శిగా విఘ్నేశ్వర్, సహ కార్యదర్శులుగా సురేశ్‌నాయక్, శశిరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా కృష్ణ, మహిళా కార్యదర్శిగా జయప్రద, క్రీడాకార్యదర్శిగా లావణ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా శ్రీను, లక్ష్మణ్, నందన, పాండులు ఎన్నికయ్యారు.

గురువులు సమాజ మార్గదర్శకులు



సన్మానం పొందిన టీచర్లతో ఎంఈవో పాండు, పాపిశెట్టి రాము

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ సమాజ నిర్మాణానికి గురువే గొప్ప మార్గదర్శి అని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఎంఈవో పాండులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మానస గార్డెన్‌లో శుక్రవారం సాయిరామ్ మెడికల్ హాల్, సాయిరామ్ ఆప్టికల్స్ సహకారంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఎంఈవో పాండు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి పాపిశెట్టి రాము ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల పరిధిలోని టీచర్లను రాముశ్వేత దంపతులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ప్రిన్సిపాల్ మాధవరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లేశ్, అశోక్‌రెడ్డి, సరస్వతి, స్వాతి, హెచ్‌ఎంలు రామలక్ష్మి, పద్య, చందూలాల్, పద్మజ్యోతి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అందించాలి

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ అన్నారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. మల్లేశ్, జిల్లా కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనంతో పాటు రూ.10 లక్షల ఇన్సూరెన్స్, కాల పరిమితి ముగిసినవారికి రూ.2లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సామ్యేల్, అధ్యక్షుడిగా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా మధు, కోశాధికారిగా నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా ఇందిర, జయేందర్, యాదమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, సహాయ కార్యదర్శిగా సుజాత, సలహాదారుడిగా నాగేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంపత్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా దశరత్, సీహెచ్ స్వామి, గోపాల్, అక్షిత్, రవిని ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా సువర్ణ, నీలమ్మ, చంద్రయ్య, సాగర్, సంజీవ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ప్రతీ కుటుంబానికి మేలు

ఆమనగల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరిగి ప్రజలంతా సంతోషంగా ఉన్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, శంకర్, శేఖర్‌గౌడ్, సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా జగదీశ్

కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు మున్సిపాలిటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన మల్లేపాకుల జగదీశ్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే కసిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీశైలం, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు బీచ్యానాయక్, షాబోద్దీన్, తదితరులు ఉన్నారు.



సదస్సులో యునెస్కో పాలకమండలి చైర్మన్ బీపీ శర్మ

భారతీయ జ్ఞాన వ్యవస్థపై జాతీయ సదస్సు

ఖైరతాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధునిక శాస్త్ర సాంకేతికత రుగ్వేద, యుజుర్వేదాలలో నిబిడీకృతమై ఉన్నాయని యునెస్కో ఎంజీఐఈపీ పాలక మండలి చైర్మన్ ప్రొఫెసర్ బీపీ శర్మ అన్నారు. నందిగామలో సింబయోసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం 'ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్' అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఇందులో భారతీయ జ్ఞానవ్యవస్థ, సమకాలీన శాస్త్రీయ, ఆర్థిక, వ్యాపార లక్ష్యాలు అనే అంశంపై శర్మ మాట్లాడుతూ రుగ్వేద, యజుర్వేదాలలో ప్రస్తుత అత్యాధునిక పోకడలను శాస్త్రీయంగా బోధించారని తెలిపారు. పార్లమెంటు మాజీ సభ్యుడు పవన్ వర్మ, సింబయోసిస్ సంచాలకులు ప్రొఫెసర్ వేణుగోపాలరావు, న్యాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సునీల్ జార్జ్, ఎస్ఐటీ డైరెక్టర్ డాక్టర్ రజనీకాంత్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించరా?

టీపీఆర్ఎంఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై సంబంధిత ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రి దృష్టి సారిస్తే మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తామని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం (టీపీఆర్ఎంఈఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్ అన్నారు. తమ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఏర్పాటుచేసిన మండలాల్లో ఇప్పటివరకు కొత్త పోస్టులు మంజూరు కాలేదని, తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై సిబ్బందిని అక్కడకు పంపించి పనులు కొనసాగేలా చేస్తున్నారే తప్ప ప్రభుత్వం నుంచి కొత్తగా పోస్టులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొత్తగా ఏర్పాటైన మండలాలకు అన్ని పోస్టులు మంజూరు చేసి, ఖాళీగా ఉన్న స్థానాల్లో సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా, జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 150కు పైగా ఖాళీగా ఉన్న ఎంపీడీవో పోస్టులను పదోన్నతుల ద్వారా వెంటనే భర్తీ చేయాలన్నారు.

రేడియల్ రోడ్డు నిర్మాణం వద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పరిగి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలం రంగాపూర్ నుంచి శంషాబాద్ వరకు నిర్మించతలపెట్టిన రేడియల్ రోడ్డుకు వ్యతిరేకంగా స్థానిక రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రంగాపూర్ రైతు వేదిక వద్ద భూములు కోల్పోతున్న రైతులంతా సమావేశమై నిరసన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుకు సంబంధించి గుగూల్‌లో సర్వే రిలీజ్ చేయడం ఆందోళనకు గురి చేసిందని రైతులు వాపోయారు. ఇప్పటికే ఉన్న రోడ్డును వెడల్పు చేస్తే సరిపోతుందని, 330 ఫీట్ల రోడ్డు వేయడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. పూడూరు మండలం దామగుండంలో నిర్మిస్తున్న నేవీ రాడార్ ద్వారా పుణ్యక్షేత్రం పరిసరాల్లో ఉన్న పచ్చని చెట్లు లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేవీ రాడార్‌ను తీసుకొచ్చి ఇక్కడి అడవులను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేవీ రాడార్ నిర్మాణానికి అడవులు నశించడంతోపాటు, రేడియల్ రోడ్డు కోసం రైతుల భూములు పోవడం తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వం స్పందించే వరకూ పోరాడుతాం

కొనసాగుతున్న భూ నిర్వాసితుల దీక్షలు

కడ్తాల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్పందించే వరకు తమ పోరాటాన్ని పోరాటం కొనసాగిస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూ నిర్వాసితులు, నాయకులు స్పష్టం చేశారు. కడ్తాల మండల కేంద్రాన్ని అనుసరించి పచ్చటి పంట పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 12వ రోజుకు చేరింది. దీక్షలో భూ నిర్వాసితులు, నాయకులు బాచిరెడ్డి రవీందర్ రెడ్డి, బాచిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, వెంకట్రాములు గౌడ్, వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, పెంటారెడ్డి, అభిషేక్ రెడ్డి, క్యాతిక కృష్ణ, రాములు, లాయక్‌అలీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు తొలగింపు



చెట్టును తొలగిస్తున్న పోలీసులు

కేశంపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గాలిదుమారంతో రోడ్డుపై కూలిన చెట్టును పోలీసులు తొలగించి శభాష్ అనిపించుకున్నారు. వివరాలలోకి వెళ్తే.. కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట - మక్తమాదారం ప్రధాన రహదారిపై సంతాపూర్ శివారులో గురువారం రాత్రి గాలిదుమారానికి ఓ పెద్ద చెట్టు విరిగి రోడ్డుపై అడ్డంగా పడింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నలిచిపోయాయి. శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న కేశంపేట కానిస్టేబుళ్లు పురుషోత్తం, కిరణ్ సంతాపూర్ గ్రామ యువకుల సహకారంతో డోజర్ తెప్పించి చెట్టును తొలిగించారు. వాహనదారులు, గ్రామస్తులు పోలీసులను అభినందించారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి

ధారూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం అన్నారు. శుక్రవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ముగ్గురు రైతులకు నాణ్యమైన కంది, వరి, జొన్న విత్తనాలను పంపిణీ చేసి సాగు చేయించామని చెప్పారు. పంట పూర్తయిన తర్వాత ఆ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పవన్ చంద్రారెడ్డి, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి, ఏడీఏ వెంకటేశం, ఏవో సూర్య ప్రకాష్, ఏఈవోలు సంజూ రాథోడ్, సంతోష్, రైతులు ఉన్నారు.

రోడ్డును బాగు చేయాలి

కందుకూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రం ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని మండల వైద్యాధికారి హుమేరా సుల్తానాతో కలిసి పరిశీలించారు. నీరు నిలవడంతో రోగులతో పాటు స్థానికులు నిత్యం ఇబ్బందులకు గురౌతున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ వద్ద వర్షపు నీటిని పరిశీలిస్తున్న బాల్‌రాజ్ తదితరులు

అధ్వానంగా రోడ్లు


బషీరాబాద్ గ్రామ పంచాయతీ వద్ద ప్రధాన రోడ్డు

బషీరాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట ప్రధాన రోడ్డును ఎక్స్‌కావేటర్‌తో తవ్వి వదిలేశారు. ఈ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు గల మార్గాన్ని అభివృద్ధి పర్చేందుకు రూ.30కోట్లు మంజూరు కాగా కాంట్రాక్టర్ ఇటీవల పనులు మొదలుపెట్టారు. బషీరాబాద్‌లోని ప్రధాన మార్గాన్ని సీసీనిర్మాణం చేపట్టేందుకు పదిరోజుల కిందట తవ్విన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా భగీరథ నీటి పైపులు పగిలి నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. ఈ మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే సీసీరోడ్డు పనులు సకాలంలో ప్రారంభకాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ధారూరు: నాగసమందర్ గ్రామ శివారులో పీహెచ్‌సీ ఎదుట ఉన్న బీటీ రోడ్డు వర్షాలకు ప్రవహించిన వరద నీటి ఉధృతికి దెబ్బతిని పెద్ద గుంత ఏర్పడింది. వాహనాలు గుంతపడిన ప్రాంతంలో అదుపు తప్పితే కాలువలోకి పడిపోయే ప్రమాదం ఉంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డును మరమ్మతులు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


ధారూరు: నాగసమందర్ పీహెచ్‌సీ ఎదుట గుంతపడి ప్రమాదకరంగా మారిన రోడ్డు

వినియోగంలోకి పరిషత్ భవనాలు

(ఐదో పేజీ తరువాయి)

చేశారు. ఇప్పుడు ఈ కార్యాలయాలు సొంత భవనాల్లోకి మారనుండటంతో ప్రజల కష్టాలు తీరనున్నాయి. అదేవిధంగా శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలోకి శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్, మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయంలోకి జవహర్ నవోదయ విద్యాలయం, ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంను మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి కేటాయించనున్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల్లో ఉన్న రికార్డులను భద్రపరిచి కార్యాలయాలను ఆయా కార్యాలయాలకు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అనుమతులు రాగానే తరలిస్తాం

జిల్లాలో పలు మున్సిపాలిటీల పరిధిలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న రిజిస్ట్రార్ కార్యాలయాలకు జిల్లా పరిషత్, మండల పరిషత్ భవనాలు కేటాయిస్తూ ఆదేశాలు వచ్చాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల రాగానే కార్యాలయాలను తరలిస్తాం.

- అశోక్, జిల్లా రిజిస్ట్రార్

నానో యూరియా వాడకాన్ని పెంచాలి

- పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి


పరిగిలోని ఆగ్రోస్ కేంద్రం సందర్శనలో ఎమ్మెల్యే

పరిగి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియా వాడకాన్ని పెంచాలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని ఆగ్రోస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల యూరియా ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ కేంద్రాన్ని సందర్శించినట్లు తెలిపారు. యూరియా అమ్మకాలపై ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యూరియా కొరత లేదని తెలిపారు. రైతులు అధికంగా యూరియా వాడడం వల్లే సమస్య ఎదురవుతోందన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుంగా అవసరమైన మేరకు యూరియా తెప్పిస్తున్నామని తెలిపారు. అయితే రైతులు కూడా యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కొమిరె రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. ఆనంద్


కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అభినందించారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయనను ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా అక్రమ కేసులు పెడుతోందని ఆయన ఫిర్యాదుచేశారు. ప్రజా సేవ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, నియోజకవర్గ బృందాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్తున్న తీరును పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు


కేజీబీవీలో బతుకమ్మలతో విద్యార్థినులు

యాలాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటపాలతో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ అన్నారు. చేర్యాస్ చౌరస్తా వద్ద పాఠశాలల విద్యార్థులతో శుక్రవారం ఆయన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్‌ఆటోనీస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి


యాలాల: బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

యాలాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జుంటుపల్లి గ్రామానికి చెందిన ఇసాక్ పటేల్ ఇటీవల గుండెపోటుతో ఆస్పత్రి పాలయ్యాడు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.60వేలు మంజూరయ్యాయి. అట్టి చెక్కును చీఫ్‌విప్ శుక్రవారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు సిద్ధయ్యగౌడ్, సీహెచ్ శేఖర్ తదితరులు ఉన్నారు.

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కుర్మని దస్తప్ప శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. చాకలి హన్మంతు, కన్కప్ప, లక్ష్మప్పలకు రూ.50వేల చొప్పున, అనితకు రూ.35వేలు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్రావ్ సహకారంతో చెక్కులు అందసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశప్ప పాల్గొన్నారు.

చౌడాపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ శుక్రవారం సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా నాయక్, రాములు, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

దుద్యాల: మండల కేంద్రానికి చెందిన లాల్‌కోట నర్సమ్మ, గోవిందుగారి చెనమ్మలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. నర్సమ్మ, గోవిందు గారి చెన్నమ్మలకు రూ.60వేలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, మాజీ సర్పంచ్ ఖాజ, కృష్ణ, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

మాధవరెడ్డి సేవలు చిరస్మరణీయం


మాధవ రెడ్డికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమర యోధుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి మాధవరెడ్డి 16వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మాధవరెడ్డి విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలకు హ్యాకథాన్ దోహదం


జాతీయ స్థాయి హ్యాకథాన్‌ను ప్రారంభిస్తున్న సెయింట్ పీటర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆవిష్కరణలకు హ్యాకథాన్ దోహదపడుతుందని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రామిరెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెంట్‌పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు కొనసాగే జాతీయ స్థాయి హ్యాకథాన్ స్పెక్ట్రన్ 2025ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామిరెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో రాణించాలనుకునే ఇంజనీరింగ్ విద్యార్థులకు హాకథాక్‌లలో పాల్గొన్నానాడే వారికి కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 60బృందాలు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఐసీ ఉపప్రధాన మేనేజర్ సంతోష్ ఛావుల, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి.సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, కార్యదర్శి టీవీ.రెడ్డి, హెచ్‌వోడీ డాక్టర్ శాంతి పాల్గొన్నారు.

తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్

తాండూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో తాండూరు పట్టణం సెయింట్ మార్క్స్ జూబ్లీ పాఠశాలలో శుక్రవారం కలర్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ఫిట్‌నెస్, టెక్నికల్ విభాగాలలో పరీక్ష జరిగింది. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఆర్. రాజు, పాఠశాల ప్రిన్సిపల్ రేష్మా, పాఠశాల జోన్ ఆఫ్ అకాడమి సతీష్, కోచ్ పురుషోత్తం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్లతో సత్కరించారు.

హకీంపేట్‌లో వైద్య శిబిరం


మాట్లాడుతున్న వైద్యురాలు వందన

దుద్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హకీంపేట్ పీహెచ్‌సీలో శుక్రవారం స్వస్థ్ నారి శక్త్ పరివార్ అభియాన్ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 89 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు వైద్యురాలు వందన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు శృతి, విద్య, హర్ష, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే పరామర్శ


విద్యార్థి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బషీరాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని జడ్పీహెచ్ఎస్ మైదానంలో ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలకు జినుగుర్తి మోడల్ స్కూల్ విద్యార్థి హాజరు కాగా ఓ చెట్టు కొమ్మ విరిగిపడి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. బాధిత విద్యార్థి సుశాంత్‌ను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స నిమిత్తం కుటుంబీకులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు.

'ఆపరేషన్ సిందూర్'పై వ్యాసరచన పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సాహ్రు శ్రీలత

తాండూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ జన్మదిన సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాండూరులోని మల్‌రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 'ఆపరేషన్ సిందూర్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అనంతరం బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మాజీ కౌన్సిలర్ సాహ్రు శ్రీలత మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశం కోసం చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మల్లేశం, కృష్ణ ముదిరాజ్, భద్రేశ్వర్, అనురాధ పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి?


ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

శామీర్‌పేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా ప్రభుత్వం మాకు జీతాలను ఇవ్వకుంటే ఎలా బతకాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కార్మికులు శుక్రవారం సీఐటీయూ, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆ మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. వెట్టి చాకిరి చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులపాలవుతున్నామని తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం


బొంపల్లిలో సన్మానం పొందిన ఉపాధ్యాయులతో గ్రామస్తులు

దోమ: బొంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులను శుక్రవారం గ్రామస్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గ్యమానాయక్, ఎంఈవో వెంకట్, ప్రధానోపాధ్యాయుడు షఫీ, ఉపాధ్యాయులు ప్రవీణ్, విజయ్‌సాయి, ముత్యప్ప, ఖయ్యూం పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి..

దోర్నాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వాసురాం పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనను ఎంఈవో వెంకట్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు శివ, మల్లేశ్, సీఆర్‌పీ వెంకటేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు వాసురాం పాఠశాల విద్యార్థుల కోసం రూ.4వేల విలువ గల వస్తువులు అందించారు.


వాసురాంను సన్మానిస్తున్న ఎంఈవో వెంకట్

క్రైం కార్నర్

డిప్లొమా విద్యార్థిని ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డిప్లొమా సెకెండియర్ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కళాశాల సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సూర్యాపేట జిల్లా, నేరేడుచర్ల శాంతినగర్‌కు చెందిన విద్యార్థిని తులసి(17) ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని మెగా ఇంజనీరింగు కళాశాలలో డిప్లొమా సీఎస్‌సీ సెకెండియర్ చదువుతుంది. శుక్రవారం భోజనం విరామం తరువాత హాస్టల్ గదికి వెళ్లి తరగతిలోకి తిరిగిరాలేదు. సాయంత్రం 4గంటల తరువాత తోటి విద్యార్థినులు హాస్టల్ గదికి వెళ్లి చూడగా లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా తులసీ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తలుపులు పగులగొట్టి ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కుటుంబీలకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దోమ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని మల్లెపల్లికి చెందిన బాలయ్య, భార్య చిట్టెమ్మ బైక్‌పై శుక్రవారం పరిగి నుంచి స్వగ్రామం మల్లెపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో రాకొండ గ్రామానికి చెందిన ట్రాక్టర్ పరిగి వెళ్తుండగా ఊటుపల్లి సమీపంలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలయ్య కాలు విరగగా భార్య చిట్టెమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సిగరెట్ కోసం దుకాణాదారుడిపై దాడి

- నిందితుడి అరెస్ట్


నిందితుడితో కరన్‌కోట్ పోలీసులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిగరేట్ కోసం అడివప్ప అనే వ్యక్తి ఓ దుకాణాదారుడిపై దాడి చేశాడు. మండలంలోని చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన అంజయ్యగౌడ్ చిట్టిఘనాపూర్ గ్రామసమీపంలోని పెన్నా అదాని గ్రూప్‌కు చెందిన కర్మాగారం వద్ద కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. బెల్కటూర్ గ్రామానికి చెందిన అడివప్ప అనే వ్యక్తి సిగరేట్ కోసం దుకాణం వద్దకు వెళ్లి గొడవకు దిగాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అడివప్ప దుకాణం యజమానిపై కర్రతో దాడి చేశాడు. దీంతో యజమాని కుడి, ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాండూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద్‌రావుపేట్ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను యాలాల పోలీసులకు గ్రామస్థులు పట్టించారు. మొత్తం ఏడు ఇసుక ట్రాక్టర్లు పట్టించగా అందులో ఆరు ఇసుక ట్రాక్టర్లకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఉండటంతో పత్రాలను పరిశీలించి వదిలిపెట్టారు. మరో ఇసుక ట్రాక్టర్‌ను అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు ఒకరు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో అట్టి ట్రాక్టర్‌ను వదిలిపెట్టాలని నియోజకవర్గానికి చెందిన ఓ రెవెన్యూ అధికారితో పాటు అధికార పార్టీ నేతలు యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. అయినప్పటికీ ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు. అయితే సంబంధిత ఇసుక ట్రాక్టర్‌ను తాండూరు మండలం రాంపూర్ తండాకు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక తరలిస్తున్నామని తాండూరు తహసీల్దార్ నుంచి మరో తేదీపై లేఖ తెచ్చుకోవడం గమనార్హం.

ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

- కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

తాండూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్‌చేసి సంబంధిత కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు యాలాల ఎస్ఐ విఠల్ రెడ్డి చెప్పారు. తిమ్మాయిపల్లిలో రోడ్డు పనుల కోసమని అనుమతి లేకుండా పెద్ద ఎత్తున ఎర్రమట్టిని తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదులు రావడంతో సంబంధిత నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో రెండు టిప్పర్లలో ఎర్రమట్టి ఉండటంతో వాటిని సీజ్ చేశారు. కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాండూరులో పకడ్బందీగా సర్వే


సంగెంకలాన్‌లో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి

తాండూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద తాండూరు మండలంలో పక్బందీగా సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. మండలంలోని 33 పంచాయతీలు 8 అనుబంధ గ్రామాల్లో ఈ సర్వే కొనసాగుతుందన్నారు. 6401 ఇళ్ల సర్వే చేయడమే లక్ష్యమని తెలిపారు. ఈ సర్వేలో 54 ప్రశ్నలు ఉన్నాయని, వాటికి సమాధానాలను సేకరించి యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుందన్నారు. ఈ సర్వేను ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌ను రద్దు చేయాలి


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

వికారాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్‌ను రద్దు చేయాలని వైద్య ఆరోగ్య సిబ్బంది కోరారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను, డీఎంహెచ్‌వో లలితాదేవిని శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ హెల్త్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా ఛైర్మన్ చంద్రప్రకాశ్, శ్రీనివాసులు, జయరాములు, రేణుకుమార్, వెంకన్న, తిరుపతయ్య, రవీందర్ రెడ్డి, ప్రకాశ్, ఫకీరప్ప, అమరేశ్వరీ, విజయలక్ష్మీ, అనీత, ఉమాదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్ట్

శామీర్‌పేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ బయల్దేరిన మండలంలోని పలువురు అంగ్‌వాడీ టీచర్లను శామీర్‌పేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభారాణి, సీఐటీయూ మేడ్చల్ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్‌లు తీవ్రంగా మాట్లాడుతూ.. అరెస్టులను తీవ్రంగా ఖండించారు. ప్రజా పాలనకు ముందస్తు అరెస్టులు నిదర్శనమా? అని ప్రశ్నించారు.

సంక్షిప్తంగా..

అర్థమయ్యే విధంగా బోధించాలి

వికారాబాద్: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులకు టీఎల్ఎం మేళా నిర్వహించారు. దీంతో 200లకు పైగా ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులకు సంబంధించి 200లకు పైగా టీఎల్ఎంలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన తొమ్మిది ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీఈవో రేణుకదేవి, మండల విద్యాధికారి బాబుసింగ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల శ్రమదానం

దోమ: అయినాపూర్‌లో శుక్రవారం దేశ ప్రధాని మోదీ జన్మదినం, మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకులు శ్రమదానం నిర్వహించారు. మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, ప్యాట అశోక్ కుమార్, బోయిని చిన్నబాబు, సత్యం, దస్తయ్య, శేఖర్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన గ్రామపాలన అధికారులు

దుద్యాల: మండల తహసీల్దార్ కిషన్‌నాయక్ నూతన జీపీవో అధికారులకు శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పాలన అధికారులు ప్రజలతో మమేకమై పని చేయాలన్నారు. జీపీవోలు గోపాల్, శ్రీనివాస్, రమేశ్ విధుల్లో చేరారు.

సీలింగ్ భూముల వివరాల కోసం దరఖాస్తు

బషీరాబాద్: నవాంద్గీ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 182, 183లో సీలింగ్ భూముల వివరాలు ఇవ్వాలని కేవీపీఎస్ మండలాధ్యక్షులు ఎడ్ల సురేష్ శుక్రవారం సమాచారం హక్కు చట్టం కింద తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ భూముల్లో మట్టి తవ్వకాలకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా ఇవ్వాలని దరఖాస్తులలో కోరారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రేరణ తరగతులు ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం, పదో తరగతి, ఇంటర్ తర్వాత ఉన్నత విద్యకు ప్రణాళికబద్ధంగా విద్యను అభ్యసించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్ సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను మార్గనిర్దేశకులుగా భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, బాకారం మల్లయ్య, శివరాజ్, లక్ష్మీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన బంజారాలు

ఘట్‌కేసర్: బంజారాలను ఎస్టీ జాబితా లోంచి తొలగించాలనే కుట్రలను తిప్పికొట్టాలని బంజారా సంఘం నాయకులు నానావత్ బిక్కు నాయక్, నానావత్ రూప్‌సింగ్ నాయక్‌లు డిమాండ్ చేశారు. నగరంలోని ఇందిరా పార్కు వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలకు చెందిన పలువురు తరలి వెళ్లారు. ఈసందర్భంగా అన్నోజిగూడలోని సంస్కృతి టౌన్‌షిప్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గిరిజనుల మధ్య అగ్గి రాజేయాలని చూడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బంజారా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే నవభారత నిర్మాణం

పరిగి: విద్యార్థుల చేతుల్లోనే నవభారత నిర్మాణం ఉందని ఎంపీడీవో ఎంఏ కరీం అన్నారు. స్వచ్ఛత హిసేవ-2025లో భాగంగా శుక్రవారం పరిగి మండలం రంగాపూర్ గ్రామ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, మానవ హారం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.